

# కథలోంచి కథ

## -కె.వరలక్ష్మి



(గత సంచిక తరువాయి)

**'పిండిబొమ్మలు' కథ గురించి.**

నేను స్కూల్‌ఫైనల్ చదివేటప్పుడు మా ఊరు జగ్గంపేటలో పబ్లిక్ పరీక్షలకి సెంటర్ లేదు. చుట్టుపక్కల చాలా ఊళ్ళవాళ్ళు అప్పటి తాలూకా కేంద్రమైన పెద్దాపురం వెళ్ళి పరీక్షలు రాయాల్సి వచ్చేది. పెద్దాపురం మా ఊరికి పదిమైళ్ళు. ప్రైవేటు బస్సులు జనం నిండితేనే కదిలేవి, టైంతో పనిలేదు. ఇంట్లో పెద్దవాళ్ళకీ, మాకూ కూడా రోజూ అలా ప్రయాణం చెయ్యడం అప్పట్లో చాలా పెద్ద విషయం, క్లాసులో అమ్మాయిలం అయిదుగురం. పరీక్షలయ్యే వరకూ మీనాక్షి అక్కయ్యగారింట్లో ఉండేలా ఏర్పాట్లు చేసారు, అది పెద్దాపురం కాబట్టి రాత్రులు బైటికి రావద్దనీ, ఎప్పుడూ అందరూ కలిసే ఉండమని రకరకాల జాగ్రత్తలు చెప్పి పంపించారు. నిజానికి ఇప్పుడు హైవేల పక్క ఊళ్ళన్నీ ఒకప్పటి పెద్దాపురాన్ని మించిపోయాయి. మేం భయం భయంగానే లూథరన్ హైస్కూల్లో పరీక్షలు రాసాం. పెద్దవాళ్ళు భయపెట్టేసారు కానీ, అక్కడంత దుర్మార్గులెవరూ లేరు. అదీ అన్ని ఊళ్ళలాంటి ఊరే.

ఇంచుమించు పదిహేను రోజులు ఉండిపోవడం వల్ల మీనాక్షి అక్కా, బావలు మాకు ఇంట్లో మనుషుల్లాగే అనిపించారు. అంత బాగా చూసుకున్నారు మమ్మల్ని. పరీక్షలు ముగిసి ఇంక ఊరికి బయలుదేరతామనగా మీనాక్షి బావగారు బజారుకి తీసుకెళ్ళి గాజులు రిబ్బన్లులాంటివి కొని ఇచ్చారు మాకు. అక్కణ్నుంచి కొంతముందుకు నడిపించి దర్గా సెంటర్లో రోడ్డు పక్కనున్న ఒక పెంకుటింట్లోకి తీసుకెళ్ళారు. ఇంచుమించు ముప్పయ్యేళ్ళ వయసున్న ఒకావిడ మమ్మల్ని 'రండి రండి' అని ఆహ్వానించి, చాపవేసి కూర్చోబెట్టి తినడానికేవో పెట్టింది. ఒంటిమీద ఎలాంటి నగలు లేవు. వెలిసిన వాయిలు చీర కట్టుకుంది. అతి సామాన్యంగా, నీట్‌గా ఉంది. మాట్లాడే విధానం ఎంతో బావుంది. మీనాక్షితో వాళ్ళ బావగారి గురించి మాట్లాడుతోంది. అమాయకంగా అందర్నీ నమ్మేసి వ్యాపారంలో డబ్బు ఎలా పోగొట్టుకున్నారో, తన ఒంటిమీది నగలను కూడా ఎలా పట్టుకుపోయారో చెప్తోంది. ఆయన మీద జాలిపడుతోంది. నా సహజలక్షణంతో నేనావిడ మాటలు వింటూ, రెండు గదుల ఆ ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచిందో పరిశీలిస్తూ కూర్చున్నాను. బైటికొచ్చాక చెప్పింది మీనాక్షి వాళ్ళ బావగారికి ఆ ఇల్లు చిన్నిల్లు అని, ఆమె కళావంతుల కుటుంబానికి చెందిందని, దర్గా సెంటర్లో అందరూ వాళ్ళే ఉంటారని. అది 1965 నాటిమాట. అప్పట్లో ఈ ప్రాంతంలో చాలామంది మగవాళ్ళకి చిన్నిల్లు ఉండడం గొప్ప. ఆవిడే 'పిండిబొమ్మలు'లో రమణి పాత్రకు మూలం. మరో ఇరవై ఏళ్ళ తర్వాత మా తమ్ముళ్ళు హైదరాబాద్‌లో సెటిలయ్యాక నేను వాళ్ళింట్లో ఉన్నప్పుడు పొట్టిగా, కొంచెం బొద్దుగా, పాలమీగడ రంగులో ఉన్న ఒకమ్మాయి చేతిలో యాపిల్ సైజులో ఉన్న బంగారు కుంకుమ భరిణ పట్టుకుని కృష్ణాష్టమి పిలుపులకి వచ్చింది. ఆ అమ్మాయిలో అందంకన్నా ఆకర్షణ ఎక్కువగా ఉంది. కథలోని కృష్ణాష్టమి పూజ దృశ్యం ఆ ఇంట్లో జరిగిందే ఆ అమ్మాయి హీరోయిన్‌గా సి.ఏ గారు సినిమా తియ్యబోతున్నాడని మావాళ్ళింట్లో అనుకున్నారు. కానీ, అది జరిగినట్టులేదు. ఆ అమ్మాయే సౌగంధి. వాళ్ళమ్మ మందారం పేలస్‌లాంటి భవనమంతా తిప్పి చూపిస్తూ పాలరాతి గచ్చుతో నీట్‌గా ఉన్న బాత్‌రూం చూపించి "చల్లగా

